క్లుప్తంగా

వరద బాధితులకు విరాళం



ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావుకు చెక్కు అందిస్తున్న ప్రైవేట్ కళాశాల యాజమాన్యం

మద్దిలపాలెం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం అనకాపల్లికి చెందిన ఓ ప్రైవేట్ కళాశాల యాజమాన్యం విరాళం అందించింది. ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావుకు గురువారం రూ.25 వేల చెక్కును అందించారు. ఈ మొత్తాన్ని ముఖ్య మంత్రి సహాయ నిధికి పంపాలని కోరారు. కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య టి.వి.కృష్ణ, అసోసియేట్ డీన్ ఎ.ఆర్.ఎస్.హనుమాన్, ఆయా కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

నోటి శుభ్రతతో దంత సంరక్షణ

బీచ్‌రోడ్డు: మారుతున్న ఆహారపు అలవాట్ల కారణంగా దంత సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయని దంత వైద్య నిపుణురాలు డాక్టర్ వెంకట మౌనిక తెలిపారు. ప్రపంచ దంత వైద్యుల దినోత్సవం సందర్భంగా గురువారం సిరిపురంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రతి రోజు రెండు సార్లు బ్రష్ చేసుకోవడం, తిన్న తరువాత 15 నిమిషాలకు నోటిని శుభ్రం చేసుకోవాలన్నారు. మధుమేహం ఉన్న వారికి దంతాలు వేగంగా ఊడిపోతాయని, వారు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మారుతున్న వైద్య విధానం, అత్యాధునిక పద్ధతుల ద్వారా దంత సమస్యలను వేగంగా పరిష్కరించుకోవచ్చని వివరించారు.

6న వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సమావేశం

మద్దిలపాలెం: ఈ నెల 6న ఉదయం 10 గంటలకు డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల ప్రాంగణంలోని గాంధీ సెంటర్ హాల్‌లో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ వార్షిక సమావేశం నిర్వహించనున్నట్లు సొసైటీ కార్యదర్శి ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులందరూ హాజరు కావాలని ఆయన కోరారు. సొసైటీలో కొత్తగా చేరాలనే వారు కూడా పాల్గొనవచ్చని చెప్పారు. గోవా ఫిల్మ్ ఫెస్టివల్ డెలిగేట్స్ ఎన్నిక ఈ సమావేశంలో జరుగుతుందన్నారు. వివరాలకు 90324 77463 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రశాంతి పార్కు ఆధునికీకరణకు శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి, అధికారులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–4లోని ప్రశాంతి పార్కు ఆధునికీకరణకు గురువారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పలువురు జీవీఎంసీ ఉన్నతాధికారులు శంకుస్థాపన చేశారు. రూ.19 లక్షలతో ఈ పార్కు అభివృద్ధి పనులు జరగనున్నాయి. పార్కులో అసాంఘిక వ్యక్తుల చొరబాటు, కార్యకలాపాలను అడ్డుకునే విధంగా కాంపౌండ్ వాల్ ఆధునికీకరణ, పార్కు సుందరీకరణతోపాటు చిల్డ్రన్ ప్లే ఏరియా అభివృద్ధి చేయనున్నారు. కార్యక్రమంలో జోన్–3 కమిషనర్ శివప్రసాద్, టీడీపీ నాయకుడు పట్టాభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

మధురవాడ: ప్రైవేటు ఆస్పత్రుల్లో 5శాతం ఉచితంగా స్కానింగ్‌లు చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు స్పష్టం చేశారు. మారికవలసలో గాయత్రి హాస్పిటల్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ రిజిస్టర్ ఉందా, ఫారం ఎఫ్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. అలాగే 5శాతం ఉచితంగా స్కానింగ్ చేస్తున్నారా అని ఆరా తీశారు. ఉచిత స్కానింగ్‌కు రిజిస్టర్ నిర్వహించాలన్నారు.

ఆరిలోవ సీఐ ఎవరు?



విధుల్లో చేరని కొత్త ఇన్‌స్పెక్టర్

వారానికి ఒకరు ఇన్‌చార్జిగా బాధ్యతలు

నెల రోజులుగా నడుస్తున్న తతంగం



ఆరిలోవ పోలీస్ స్టేషన్

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు సర్కిల్ ఇన్‌స్పెక్టర్(సీఐ) ఎవరో తెలియడం లేదు. సుమారు నెల రోజులకు పైగా ఈ స్టేషన్‌కు సీఐ లేకపోవడంతో వారానికి ఒకరు ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపడుతున్నారు. ఏ రోజు ఎవరు సీఐగా స్టేషన్‌కు వస్తున్నారో అక్కడ సిబ్బందికే తెలియని పరిస్థితి. నెల రోజుల కిందట నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పలు స్టేషన్ల సీఐలు, ఎస్‌ఐల బదిలీలు చేపట్టారు. ఇందులో భాగంగా గత నెల 1న ఆరిలోవలో పనిచేస్తున్న సీఐ జి.గోవిందరావును వీఆర్ రేంజ్‌కు సరెండర్ చేశారు. ఆయన స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా డీసీఆర్‌బీ నుంచి హెచ్.మల్లేశ్వరరావుకు ఇక్కడ పోస్టింగ్ ఇచ్చారు. ఇంతవరకు ఆయన ఆరిలోవ పీఎస్‌లో బాధ్యతలు చేపట్టలేదు. బదిలీ జరిగిన వారానికి గోవిందరావు ఇక్కడ నుంచి రిలీవయ్యారు. ఆయన రిలీవైన వారం తర్వాత ఇన్‌చార్జి సీఐగా వీఆర్ నుంచి శ్రీనివాసరావును వేశారు. ఆయన నాలుగు రోజులకే సిక్ లీవ్‌లో వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఎంవీపీ పోలీస్ స్టేషన్ నుంచి సీఐ ఇన్‌చార్జి బాధ్యతలతో ఇక్కడికి అప్పుడప్పుడు వస్తున్నారు. ఇదిలా ఉండగా.. తాను ఇంకా రిలీవ్ కాలేదంటూ మళ్లీ పాత సీఐ గోవిందరావే రెండు రోజుల కిందట ఇక్కడికి వచ్చారు. దీంతో ఈ స్టేషన్‌కు ఎప్పుడు ఎవరు సీఐగా ఉన్నారో తెలియడం లేదు.

స్టేషన్ పరిధి విశాలం..

ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధి విశాలమైంది. అటు గీతం యూనివర్సిటీ నుంచి విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, హనుమంతవాక, ఆరిలోవ, పైనాపిల్ కాలనీ వరకు ఉంది. నిత్యం ఇక్కడ అన్ని రకాల కేసులు నమోదవుతుంటాయి. అల్లర్లు, గంజాయి, మందుబాబుల ఆగడాలు, దొంగతనాలు, భూ తగాదాలు, కొట్లాటలు, భార్యాభర్తల గొడవలు తదితర ఫిర్యాదులు ఇక్కడ ఎక్కువ. వీటితో సతమతమవుతున్న ఈ స్టేషన్‌కు పోలీస్ ఉన్నతాధికారులు సీఐ పోస్టును నెలల తరబడి గాలిలో వదిలేయడం విశేషం.

ఎమ్మెల్యే మోకాలడ్డు..!

ఇక్కడికి సీఐగా బదిలీ చేసిన మల్లేశ్వరరావును తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు రానీయకుండా అడ్డుకుంటున్నట్లు సమాచారం. గతంలో మల్లేశ్వరరావు ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో సీఐగా చేసినప్పుడు ఆయనకు సహకరించ లేదని, అందుకే ఆరిలోవకు రానీయకుండా ఆపేస్తున్నారని పోలీస్ వర్గాల్లోనే ఆరోపణలు వినిపిస్తున్నారు. ఎమ్మెల్యే కాదనడంతో సీపీ కూడా ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నారని సమాచారం. ఈ తతంగం ఎంతవరకు నిజమో కానీ నెల రోజుల దాటుతున్నా.. ఆరిలోవకు సీఐ లేని పరిస్థితి నెలకొంది. నగరంలో సమస్యాత్మక పోలీస్ స్టేషన్లలో ఆరిలోవ ఒకటిగా అధికారులు గుర్తించారు. అయినప్పటికీ ఇక్కడ సీఐ పోస్టు నెలల తరబడి ఖాళీగా వదిలేయడంపై విమర్శలకు దారితీస్తోంది. ఈ ప్రాంతంలో జరుగుతున్న నేరాలను అదుపు చేయడానికి రాజకీయ నాయకుల జోక్యానికి దూరంగా ఉండే సీఐని వెంటనే నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

కరుణించు కనకదుర్గమ్మ

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



పెదగదిలిలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి



లలితానగర్ లలితాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ఎంవీపీ కాలనీ చండికాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

ఆరిలోవ: నియోజకవర్గంలో గురువారం దుర్గాదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆరిలోవ ప్రాంతంలోని ఆలయాలతో పాటు మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. హనుమంతవాక దరి విజయదుర్గాదేవి ఆలయం, చినగదిలి లలితానగర్‌లోని లలితాదేవి ఆలయం, దుర్గాబజార్ దుర్గాదేవి ఆలయం, పాత ఆరిలోవలో దుర్గాలమ్మ గుడి, తోటగరువు ఎర్నిదుర్గా ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. పెదగదిలి, టీబీసీ పాయింట్, పాత డెయిరీఫారం ప్రాంతాల్లో మండపాలు ఏర్పాటు చేశారు. తొలి రోజు ఆయా ప్రాంతాల్లో భక్తులు కనకదుర్గమ్మను దర్శించుకుని తమను కరుణించి చల్లగా చూడాలని పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెదగదిలిలో పెద్ద ఆలయం మాదిరిగా మండపం నిర్మించి 12 అడుగులు దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దీని ఆవరణలో విష్ణుమూర్తి దశ అవతారాల విగ్రహాలు కొలువుదీరాయి. ఇక్కడ మండపంలో అమ్మవారిని మేయర్ గొలగాని హరివెంకటకుమారి దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని దుర్గాదేవిని కోరినట్లు తెలిపారు. ఉత్సవాల నిర్వాహకులు పాల్గొన్నారు.

చండికాదేవి ఆలయంలో విశేష పూజలు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–4లోని చండికాదేవి ఆలయంలో దసరా ఉత్సవాలు వైభవంగా మొదలయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు, మూలవిరాట్‌కు అభిషేకాలు చేశారు. సాయంత్రం జరిగిన చండీ హోమంలో భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. మహిళ భక్తుల భజనతోపాటు కోలాటం బృందం చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నవరాత్రులు ముగిసే వరకు నిత్యం పూజా కార్యక్రమాలతోపాటు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు పొట్టి రమణ తెలిపారు. కమిటీ ప్రతినిధులు శ్రీహరిరాజు, శ్రీనివాస్, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత జీవితం ముఖ్యం

ప్రవచన కర్త గరికిపాటి నరసింహారావు



ప్రవచిస్తున్న గరికిపాటి నరసింహారావు

బీచ్‌రోడ్డు: జీవితంలో ప్రశాంతతకు ఎక్కువ సమయం కేటాయించేలా ప్రతి ఒక్కరూ తమను తాము నిర్దేశించుకోవాలని ప్రవచన కర్త గరికిపాటి నరసింహారావు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో గురువారం సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో లోక కల్యాణార్థం ఆధ్యాత్మిక ఉత్సవం –దేవీ వైభవం పేరిట ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అమ్మవారి విగ్రహానికి పూలమాలలు వేసి జ్యోతి వెలిగించారు. ఈ సందర్భంగా ఆయన ప్రవచిస్తూ దేవీ శరన్నవరాత్రులకు ఎంతో విశిష్టత ఉందన్నారు. దుర్గాదేవి అనుగ్రహం ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. ప్రస్తుత జీవన ప్రయాణంలో ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. దేవాలయానికి వెళ్తే ఎంతో ప్రశాంతత లభిస్తుందని, మన పూర్వీకులు సైతం అమ్మవార్లను విశేషంగా కొలిచేవారని గుర్తుచేశారు. చేసే పనిలో నిజాయితీ ఉంటే లక్ష్యం కచ్చితంగా నెరవేరుతుందన్నారు. అమ్మవారి అనుగ్రహం ఎంతో పవిత్రమైనదని, విశేష ధైర్యాన్ని కలిగిస్తుందన్నారు. దుర్గాదేవి, సరస్వతీ దేవి, లక్ష్మీదేవి, మహిషాసుర మర్దని, కాళికమాత తదితర అవతారాల్లో అమ్మవారు మనకు దర్శనమిస్తారని, లోక కల్యాణార్థం అన్ని అవతారాల్లో ప్రజల కోసం అమ్మవారు అవతరించిందని వివరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ విశాఖపట్నం ప్రొగ్రాం చైర్మన్ ఆర్జీఎస్ జగన్‌మోహన్, ప్రెసిడెంట్ బి.వినయగాంధీ, సెక్రటరీ బి.మణిమాల, కోశాధికారి ఎం.కె.కుమార్, నగరానికి చెందిన ప్రముఖులు, ఆధ్యాత్మిక వేత్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై ఫుడ్ కోర్టుల తొలగింపు



ఫుడ్ కోర్టులు తొలగించిన అనంతరం ఫుట్‌పాత్

సాక్షి ఎఫెక్ట్..

బీచ్‌రోడ్డు: సిరిపురం ప్రాంతంలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఏర్పాటు చేయడంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై 'ఫుట్‌పాత్‌పై ఫుడ్ కోర్టులు' అనే శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. ఫుట్‌పాత్‌పై ఉన్న దుకాణాలను పూర్తిగా తొలగించారు. దీనితో పాదచారుల నడక, వాహనాల రాకపోకలు సాఫీగా కొనసాగుతున్నాయి.

గాంధీ తత్వంతోనే సమస్యలకు పరిష్కారం



సదస్సులో పాల్గొన్న ఆచార్య ప్రసన్నకుమార్, ఆచార్య బాలమోహన్‌దాస్ తదితరులు

మద్దిలపాలెం: సమాజంలో ఎదురవుతున్న సమస్యలకు గాంధీ తత్వంలోనే పరిష్కార మార్గాలు చూపవచ్చని వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆంధ్రా యూనివర్సిటీలోని గాంధీ అధ్యయన కేంద్రంలో ఏయూ న్యాయ కళాశాల నిర్వహిస్తున్న ఇష్యూస్ అండ్ చాలెంజెస్ ఆఫ్ జెండర్ జస్టిస్ అండ్ ఈక్వాలిటీ ఏ గాంధీయన్ పర్‌స్పెక్టివ్ రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏయూ విశ్రాంత రెక్టార్ ఎ.ప్రసన్న కుమార్ మాట్లాడుతూ గాంధీజీ దేశ ప్రజలను ఐక్యం చేసి స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపించిన విధానాన్ని వివరించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంతి ఉప కులపతి ఆచార్య వి.బాలమోహన్ దాష్ మాట్లాడుతూ గాంధీజీలోని నాయకత్వ లక్షణాలు యువతకు ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య కె.సీతామాణిక్యం మాట్లాడుతూ సత్యం, అహింసా, ఓర్పు అనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహరావు, న్యాయ కళాశాల ఎమిరిటస్ ప్రొఫెసర్ వి.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

త్రీటౌన్ ఎస్‌ఐగా సురేష్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



సీఐ పల్లా రమణయ్యను కలిసిన ఎస్‌ఐ సురేష్‌కుమార్

బీచ్‌రోడ్డు: మూడో పట్టణ పోలీస్ స్టేషన్ లా అండ్ ఆర్డర్ ఎస్‌ఐగా సురేష్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీఐ పల్లా రమణయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. సురేష్‌కుమార్ పీఎం పాలెం పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు లా అండ్ ఆర్డర్‌లో ఇద్దరు ఎస్‌ఐలు ఉండగా.. సురేష్‌కుమార్‌తో కలిపి ఆ సంఖ్య మూడుకు చేరింది. దీనితో కేసులు వేగంగా పరిష్కరించేందుకు అవకాశం ఏర్పడింది.

మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న ప్రభుత్వ మానసిక ఆరోగ్య శాల డాక్టర్ రామిరెడ్డి

మహారాణిపేట: పనిచేసే చోట మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రపంచ మానసిక ఆరోగ్య ఫెడరేషన్ పిలుపు నిచ్చిందని చినవాల్తేరు ప్రభుత్వ మానసిక వైద్యాలయం ప్రధాన వైద్యాధికారి కె.వి. రామిరెడ్డి తెలిపారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా గురువారం ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పని చేసే ప్రదేశంలో మానసిక ఆందోళనకు దూరంగా ఉండాలన్నారు. విశాఖ సైకియాట్రిక్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ ఎం.విజయలక్ష్మి , విశాఖ సైకియాట్రిక్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ ప్రసన్న కుమార్ తదితరులు మాట్లాడారు.

ఆసక్తిదాయకంగా బోధించాలి



గెస్ట్ ఫ్యాకల్టీల సమావేశంలో మాట్లాడుతున్న ఏయూ వీసీ శశిభూషణరావు

మద్దిలపాలెం: బోధనలో నూతన విధానాలను అవలంబిస్తూ, ఆసక్తిదాయకంగా బోధించాలని ఏయూ వీసీ ఆచార్య శశిభూషణరావు సూచించారు. ఏయూ సెనెట్ హాల్‌లో గురువారం జరిగిన గెస్ట్ ఫ్యాకల్టీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గెస్ట్ ఫ్యాకల్టీల రుసుమును పెంచే దిశగా కృషి చేస్తున్నామన్నారు. ప్రతి వ్యక్తి రెండు శాస్త్రాల్లో లోతైన అవగాహన పెంచుకోవాలని సూచించారు. త్వరలో ఏయూలో డబుల్ డిగ్రీ కోర్సులు ప్రారంభించనున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో విద్యా రంగంలో మార్పులు జరుగుతాయన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు మాట్లాడుతూ తరగతులను పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటామన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయిలోనే పర్యావరణ విద్య



పర్యావరణ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు తదితరులు

మద్దిలపాలెం: పాఠశాల స్థాయిలోనే పర్యావరణ విద్యను బోధించాలని, తద్వారా యువతలో పర్యావరణ స్పృహ పెరుగుతుందని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఇ.ఎస్.ధనుంజయరావు అన్నారు. వరల్డ్ నేచర్ డేను పురస్కరించుకుని ఏయూ విద్య విభాగం ఆధ్వర్యంలో గురువారం పర్యావరణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ ఉపాధ్యాయులుగా బీఈడీ, ఎంఈడీ విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే పర్యావరణంపై అవగాహన కల్పించాలన్నారు. వృక్షాలు మానవాళి మనుగడకు ముడిపడి ఉంటాయన్నారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో విజేతలకు అభినందనలు



విజేతలను అభినందిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు, రిజిస్ట్రార్ ధనుంజయరావు

మద్దిలపాలెం: జాతీయ, రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావులు గురువారం అభినందించారు. జాతీయ స్థాయిలో యోగా విద్యార్థి ఎస్.నవీన్ కుమార్ మూడో స్థానం, రాష్ట్ర స్థాయిలో బి.యామిని ప్రథమ స్థానం, సిహెచ్.శిరీష ద్వితీయ స్థానం, బి.పవన్ తృతీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా వీరిని వీసీ, రిజిస్ట్రార్‌లు ప్రసంశించారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహారావు, యోగా విభాగాధిపతి ఆచార్య కె.రమేష్‌బాబు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగిలించిన ముగ్గురి అరెస్ట్

ఎంవీపీకాలనీ: సెల్‌ఫోన్ దొంగతనానికి పాల్పడిన ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎంవీపీ క్రైం పోలీసులు తెలిపారు. వివరాలిలా.. దాసరి సూర్యకుమార్, కరి అప్పన్న, జమ్మిశెట్టి హేమంత్ అనే ముగ్గురు యువకులు ఇటీవల అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఒకే బైక్‌పై చక్కర్లు కొడుతున్నారు. అదే సమయంలో మద్దిలపాలెం కృష్ణా కళాశాల రోడ్డులో వెళ్తున్న ఎరుకొండ రాహుల్ అనే యువకుడిని ఆపి అడ్రస్ అడిగినట్లు నటించి అతడి వద్ద నుంచి సెల్‌ఫోన్ లాక్కుని పరారయ్యారు. ఈ ఘటనపై రాహుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎంవీపీ క్రైం పోలీసులు ముగ్గురు యువకులు ఆరిలోవకు చెందిన వారిగా గుర్తించారు. వారిని చాకచక్యంగా పట్టుకొని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

రక్తహీనతపై అవగాహన అవసరం

బీచ్‌రోడ్డు: రక్తహీనతను ముందుగా గుర్తించడం చాలా ముఖ్యమని ప్రోక్టర్, గాంబల్ హెల్త్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మిలింద్ థాట్టే అన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో గురువారం రక్తహీనతపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రక్తహీనతపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం ఐరన్ డెఫిషియన్సీ అనీమియా(ఐడీఏ) ఆరోగ్య సమస్యను పరిష్కరించడానికి పీ–జీ హెల్త్ ఇండియా, దేశంలోని ప్రముఖ హెల్త్‌కేర్ అసోసియేషన్లలో ఒకటైన ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్టెట్రిక్ ఫెడరేషన్‌తో కలిసి '12 కా నారా' అనే కొత్త ప్రచారాన్ని ప్రారంభించామని తెలిపారు. ప్రత్యేకంగా మహిళల్లో రక్తహీనతను ముందుగా గుర్తించడం లక్ష్యంగా చేసుకున్నామన్నారు. రక్తహీనత మన జనాభాలో అధిక భాగాన్ని ప్రభావితం చేస్తున్నందున.. ముందుగా గుర్తించడం, సకాలంలో అరికట్టడానికి సమష్టి కృషి అవసరమని పేర్కొన్నారు.

'గీత కులాలు నష్టపోకుండా చూడండి'

బీచ్‌రోడ్డు: మద్యం పాలసీలో భాగంగా కల్లు గీత కార్మిక కులాలకు 10 శాతం దుకాణాల కేటాయింపునకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సత్వరమే జారీ చేయాలని గౌడ సంక్షేమ అభివృద్ధి సంఘం అధ్యక్షుడు రాజు గౌడ యాత గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఏపీలో సుమారు 3,336 దుకాణాలకు అదనంగా 10 శాతం దుకాణాల సంఖ్య పెంచుతూ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారని, ఈ పెంచిన 10 శాతానికి త్వరగా నోటిఫికేషన్ ఇవ్వనందున గీత కులాల వారు నష్టపోతున్నారని వాపోయారు. 10 శాతం గీత కులాలకు ఇచ్చిన షాపులకు కూడా త్వరగా నోటిఫికేషన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేటాయింపులకు సంబంధించిన వాటిలో కొంతమంది సిండికేట్లు దక్కించుకోవాలని చూస్తున్నారని, అలా జరగకుండా ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలన్నారు. నోటిఫికేషన్ వెంటనే జారీ చేసి ప్రభుత్వం తన మాట నిలబెట్టుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం 10 శాతం దుకాణాల కేటాయింపు విషయంలో గీత కార్మికుల ఉప కులాలకే వ్యక్తిగతంగా దక్కేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. సీఎం చంద్రబాబు ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకోవాలన్నారు.

కూటమి నేతలకు చెక్ పెట్టాలి



సమావేశంలో పాల్గొన్న గీత కార్మిక సంఘాల నాయకులు

దాబాగార్డెన్స్: గీత కార్మిక కులాలకు మద్యం దుకాణాల కేటాయింపు నోటిఫికేషన్ సత్వరమే జారీ చేయాలని గీత కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. మద్యం పాలసీలో భాగంగా కల్లుగీత కార్మికుల కులాలకు 10 శాతం దుకాణాలు కేటాయించడంపై ఆయా సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ మేరకు నగరంలోని ఓ హోటల్లో శెట్టిబలిజ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు గుత్తుల మధుసూధన్ పలువురు సంఘ నాయకుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో సుమారు 3,336 దుకాణాలకు అదనంగా 10 శాతం దుకాణాలు సంఖ్య పెంచుతూ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిందని, అయితే ఈ పెంచిన 10 శాతానికి సంబంధించి త్వరగా నోటిఫికేషన్ ఇవ్వనందున గీత కులాలు నష్టపోతారని తెలిపారు. ఈ కేటాయింపులకు సంబంధించిన వాటిలో కొంతమంది సిండికేట్లు దక్కించుకోవాలని చూస్తున్నారని, అలా జరగకుండా ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాలకు దరఖాస్తుల అందజేత ప్రక్రియ వేగవంతమైందని, సిండికేట్, కూటమి పార్టీల నేతల ప్రభావం, ఒత్తిళ్లు అధికమయ్యాయని తెలుస్తోందన్నారు. తమ కులాలకు కేటాయిస్తామన్న దుకాణాల సంఖ్యకు నోటిఫికేషన్ ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. ఆలస్యమయ్యే కొద్దీ తాము నష్టపోయే ప్రమాదముందని, నోటిఫికేషన్ వెంటనే జారీ చేసి ప్రభుత్వం తన మాట నిలబెట్టుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంపై జోక్యం చేసుకోవాలన్నారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై పిచ్చిమొక్కలు



శ్రీకృష్ణాపురం వద్ద ఫుట్‌పాత్‌పై మొలిచిన పిచ్చిమొక్కలు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డు ఫుట్‌పాత్‌లు పిచ్చిమొక్కలతో నిండిపోతున్నాయి. వీటిపై దట్టంగా పిచ్చిమొక్కలు మొలవడంతో పాదచారులు నడవలేకపోతున్నారు. జీవీఎంసీ 13వ వార్డు శ్రీకృష్ణాపురం నుంచి పైనాపిల్ కాలనీ వరకు బీఆర్‌టీఎస్ రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌లది ఇదే పరిస్థితి. విశాఖ కేంద్ర కారాగారం క్వార్టర్స్‌లో ఉద్యోగులు, శ్రీకృష్ణాపురం వాసులు ఈ ఫుట్‌పాత్‌లపైనే ఉదయం నడక కోసం వెళ్తుంటారు. ఇవి పిచ్చిమొక్కలతో నిండిపోవడంతో సర్వీస్ రోడ్లపై నడవాల్సి వస్తోందని, ఈ రోడ్డులో ప్రయాణించే వాహనాల నుంచి ఇబ్బంది పడుతున్నామని వాకర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫుట్‌పాత్‌లపై పిచ్చిమొక్కలను తొలగించాలని జీవీఎంసీ అధికారులను కోరుతున్నారు.